



● వరి నాట్లకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు



● మోస్రాలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

జోరందుకున్న.. వరి నాట్లు

- జిల్లాలో ప్రతీరోజు వేల ఎకరాల్లో సాగు
- ఇతర రాష్ట్రాల కూలీల వినియోగం
- బిహార్, ఒడిస్సా, యూపీ కూలీలతో వరి నాట్లు
- ఈసారి సన్నరకాల సాగుకే అన్నదాతల మొగ్గు
- మరింత పెరిగిన విద్యుత్ డిమాండ్
- జిల్లావ్యాప్తంగా 4.19 లక్షలకుపైగా ఎకరాల్లో వరి సాగు అంచనా

నిజామాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో యాసంగి సాగు జోరందుకుంది. ఆరుతడి పంటలు వేసిన రైతులు వరిసాగును మొదలు పెట్టారు. జిల్లాలోని పలు గ్రామాల పరిధిలో రైతులు వరినాట్లను వేస్తున్నారు. ప్రాజెక్టులు, చెరువులు, భూగర్భ జలాలు ఉండటంతో ఈ దఫా రైతులు ఎక్కువగా వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం బోనస్ ఇస్తుండటంతో యాసంగిలో కూడా సన్నరకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. నవంబరు చివరి వారంలో నారుమల్లు సిద్ధం చేసిన రైతులు.. పొలాలను దున్నడంతో పాటు వరి నాట్లను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని కూలీలు సరిపోకపోవడంతో బిహార్, యూపీ, ఒడిస్సా నుంచి వచ్చిన కూలీలను వినియోగిస్తున్నారు. ప్రతీరోజు వేల ఎకరాల్లో వరి సాగును చేస్తున్నారు. నిజాంసాగర్ నుంచి నీటి విడుదల మొదలు కావడంతో బోధన్ డివిజన్ పరిధిలో ఎక్కువ మొత్తంలో సాగును కొనసాగిస్తున్నారు. నాట్లు వేసేందుకు పెద్దఎత్తున రైతులు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలోని రైతులంతా ఒకేసారి వరినాట్లను మొదలు పెట్టడంతో విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది. వాతావరణం చల్లగా ఉన్నా.. బోర్లను ఎక్కువగా వినియోగిస్తుండటంతో వ్యవసాయానికి డిమాండ్ ఎక్కువైంది. రైతులకు ఇబ్బందులు లేకుండా పొద్దంతా త్రీఫేజ్ కరెంటు సరఫరాను వ్యవసాయానికి కొనసాగిస్తున్నారు. యాసంగిలో ఎండలు ముందరకముందే పంటలు చేతికి వచ్చే విధంగా రైతులు ముందస్తుగా ఈ సాగును కొనసాగిస్తున్నారు.

అక్టోబరు చివరి నుంచే మొదలు

జిల్లాలో యాసంగి సాగు అక్టోబరు చివరి వారం నుంచే రైతులు మొదలు పెట్టారు. మొదట ఎక్కువ మంది రైతులు ఆరుతడి పంటలను సాగు చేశారు. ఆ పంటల పనులు పూర్తికావడంతో ప్రస్తుతం వరిసాగును కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో మొత్తం 5లక్షల 18వేల 112 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వీటికి కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచారు. జిల్లాలో అక్టోబరు చివరి వారం నుంచి ఆరుతడి పంటలను మొదలు పెట్టిన రైతులు మొక్కజొన్న, ఎర్రజొన్న, శెనగ, ఇతర పంటలను సాగు చేశారు. జిల్లాలో మొక్కజొన్న 20,840 ఎకరాల్లో వేశారు. శెనగ 16,019 ఎకరాలు, ఎర్రజొన్న 31,048 ఎకరాల్లో వేశారు. వీటితో పాటు ఇతర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కూరగాయల పంటలను కూడా రైతులు వేశారు.

70 శాతానికి పైగా వరి సాగు

ఈ యాసంగిలో జిల్లాలో 4లక్షల 19వేల 486 ఎకరాల్లో వరిసాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 50,433 ఎకరాల్లో వరి సాగును చేశారు. జిల్లాలో సాగు అయ్యే మొత్తం విస్తీర్ణంలో 70 శాతానికి పైగా వరి సాగు చేస్తారని ముందస్తుగానే అధికారులు అంచనాకు వచ్చారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులు ఫుల్‌గా ఉండటంతో.. ఈ రెండింటి పరిధిలో వరి సాగు ఎక్కువగా రైతులు చేస్తున్నారు. గుత్ప, అలీసాగర్, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాల కింద కూడా యాసంగిలో వరిసాగునే కొనసాగిస్తున్నారు. ఇవే కాకుండా చెరువులు, బోరు బావుల కింద కూడా వరిసాగును చేపడుతున్నారు. భూగర్భ జలమట్టాలు ఎక్కువగా ఉండటం వల్ల రైతులు వరిసాగుకే మొగ్గు చూపారు. ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ క్వింటాలుకు 500 ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు యాసంగిలో కూడా వాటినే సాగు చేస్తున్నారు. వానాకాలంలో 65 శాతం వరకు సన్న రకాలు వేసిన రైతులు.. ఈ దఫా 70 శాతానికి మించి పంటలు వేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సన్నాలకు డిమాండ్ ఉండటం.. అదనంగా ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారంటున్నారు.

మొదట బోరు బావుల కింద నాట్లు

జిల్లాలో నవంబరు చివరి వారం నుంచే వరి నాట్లు మొదలు పెట్టారు. మొదట బోరు బావుల కింద వరినాట్లను మొదలు పెట్టిన రైతులు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో ఎక్కువ మొత్తంలో పంట సాగు కొనసాగిస్తున్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు జిల్లాలోని ఇతర గ్రామాల పరిధిలో కూడా ప్రతీరోజు వేల ఎకరాల్లో వరినాట్లను కొనసాగిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా పొలాలను దున్నేందుకు అధిక మొత్తంలో డబ్బులు వెచ్చిస్తున్నారు. పొలాలను దున్నడంతో పాటు స్థానికంగా కూలీలు దొరకకపోవడంతో బిహార్, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలను వినియోగిస్తున్నారు. ఎకరాకు రూ.3500 నుంచి రూ.4 వేల వరకు వెచ్చిస్తున్నారు. వరి నాట్లను పూర్తి చేస్తున్నారు. ముందస్తుగా వరి నాట్లు వేస్తే ఏప్రిల్ లోపే పంట చేతికి వచ్చే అవకాశం ఉండటంతో ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. ప్రతీ

(తరువాయి 8వ పేజీలో...)

మా రాష్ట్రంలో పనులు లేక ఇక్కడికి వచ్చాం

: నజ్జు, వ్యవసాయ కూలీ, బిహార్



మా రాష్ట్రంలో ఉపాధి లేదు. పనులు తక్కువగా ఉన్నాయి. ఇక్కడ సీజన్‌లో పని దొరుకుతుంది. రెండు నెలల వరకు పని ఉంటుంది. గత కొన్నేళ్లుగా ఇక్కడికి వరినాట్లతో పాటు ధాన్యం కొనుగోలు సమయంలో ఇక్కడికి వస్తున్నాం. సీజన్‌లో ఉపాధి పొందుతున్నాం. కూలీ అక్కడికంటే ఎక్కువగా రావడం వల్ల కొంత వెనుకేసి ఇంటికి పంపిస్తున్నాం.

వరినాట్లతో పాటు ఇతర పనులు కూడా చేస్తున్నాం

: నరేష్, వ్యవసాయ కూలీ, బిహార్



ఇక్కడ వరి నాట్లు ఉన్నన్ని రోజులు పొలాల్లో పనిచేస్తున్నాం. ఈ పనులు పూర్తయిన తర్వాత.. ఇతర పనులను చేస్తున్నాం. వ్యవసాయానికి సంబంధించిన పనులు ఉన్నన్ని రోజులు ఇక్కడే ఉంటున్నాం. అక్కడి నుంచి పది నుంచి ఇరవై నుండి జట్టుగా వచ్చి ఇక్కడ పనులను చేస్తున్నాం. రైతులు కూడా తమకు నమ్మకంగా పని ఇస్తుండటంతో కొన్నేళ్లుగా ఇక్కడికి వస్తున్నాం.



చలి మంటలు కాగుతున్న ప్రజలు

ఇందూరు గజ గజ

- జిల్లాలో భారీగా తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, వృద్ధులు
- కోటగిరిలో 7.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత

8లో



డిచ్‌పల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాల భవనం

పక్కా భవనం లేక పాట్లు

- కళాశాల మంజూరై రెండు ఏళ్లు గడిచినా.. భవన నిర్మాణానికి పడని శంకుస్థాపన
- డిగ్రీ కళాశాల విద్యార్థులకు తప్పని తిప్పలు

7లో



పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య గ్రూప్-2 పరీక్షలు

● తొలిరోజు ప్రశాంతం ● ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిన అభ్యర్థులు ● నేడు 3, 4 పేపర్లు ● 50 శాతానికి మించని హాజరు



పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రానికి చిన్నారితో వస్తున్న అభ్యర్థి



చలి కారణంగా స్వెట్టర్, మాస్కులతో ఇలా..

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న పరీక్షలు జిల్లాలో 63 పరీక్షా కేంద్రాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం నిర్వహించిన పేపర్-1, 2 పరీక్షలకు అభ్యర్థులు 50 శాతానికి మించి హాజరు కాలేదు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 19,855 మంది హాజరు కావాల్సి ఉండగా.. 9,070 మంది హాజరుకాగా 10,785 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30ల వరకు జరిగిన పరీక్షకు 9,020 మంది హాజరుకాగా, 10,835 మంది గైర్హాజరయ్యారు. సోమవారం పేపర్-3, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్-2 పరీక్షలు రాసేందుకు అభ్యర్థులు అంతగా ఆసక్తి చూపకపోవడంతో హాజరుశాతం 50 శాతంకంటే తక్కువగానే నమోదు కావడం గమనార్హం. ఉదయం నిర్వహించిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పరిశీలించారు. గిరిరాజ్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి పరీక్షలు నిర్వహిస్తున్న తీరును ఆయన నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా? లేదా? అన్నది గమనించి పలు సూచనలు చేశారు.



పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పరీక్షలు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

చలి తీవ్రతతో ముందే సెంటర్‌కు..

చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు వచ్చారు. చలి తీవ్రతను తట్టుకునేందుకు స్వెటర్లు, మఫ్లర్లు, మాస్కులు ధరించి పరీక్ష కేంద్రాలకు వచ్చారు. నగరంలోని గిరిరాజ్ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాల వద్దకు సమయం మించిపోయిన అనంతరం వచ్చిన అభ్యర్థులను అధికారులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో నిరాశతో వెనుదిరిగారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 2.30 తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షకు అరగంట ముందు గేట్లను మూసివేశారు.

● పర్యవేక్షించిన ఇన్‌చార్జి సీపీ

ఖిల్లా(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి పోలీసు కమీషనర్ సింధూశర్మ పర్యవేక్షణలో గ్రూప్-2 పరీక్షలు ఆదివారం మొదటి రోజు ప్రశాంతంగా ముగిసాయి. జిల్లావ్యాప్తంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి ఘటనలు జరుగకుండా 144 సెక్షన్‌ను అమలు చేశారు. పరీక్ష కేంద్రాలకు ఇతరులు రాకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. సింధూశర్మ పరీక్ష కేంద్రాల వద్దకు వెళ్లి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లావ్యాప్తంగా 63పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్నిచర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ (అడ్మిన్)బస్వారెడ్డి, అదనపు పోలీసు కమిషనర్(ఏఆర్) శంకర్ నాయక్, నిజామాబాద్ ఏసీపీ. ఎల్.రాజవెంకటరెడ్డి, ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ముస్తాబైన జెండా బాలాజీ మందిరం

ధనుర్మాస ఉత్సవాలకు శ్రీవైష్ణవ ఆలయాల ముస్తాబు

● నెలరోజుల పాటు వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూర్యుడు వృశ్చిక రాశి నుంచి ధనస్సురాశిలోకి ప్రవేశించే అత్యంత పుణ్యప్రదమైన ధనుర్మాసం ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. నెలరోజుల పాటు జిల్లాలోని శ్రీవైష్ణవ ఆలయాల్లో ప్రాతఃకాలంలోనే పూజాదికార్యక్రమాలు కొనసాగుతాయి. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీవైష్ణ దేవాలయాలు విద్యుత్ దీపాలతో ముస్తాబు అయ్యాయి. నెలరోజుల పాటు గోదాదేవి అందించిన తిరుప్పావై పాశురాలను ఆలయాల్లో పాడనున్నారు. గోదాదేవి నెలరోజుల పాటు రంగనాథున్ని కొలుస్తూ పాటించిన ధనుర్మాస వ్రతం స్ఫూర్తిగా భక్తులు స్వామివారి సేవలో తరిస్తారు. ప్రతీరోజు ఉదయం సూర్యోదయానికి ముందే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పాశురాన్ని పఠిస్తారు. సాయంత్రం ఆలయాల్లో గోదాదేవి, రంగనాథున్ని ఆరాధించిన తీరును ప్రవచన కర్తలు భక్తులకు ప్రవచనం చేస్తారు. నెలరోజుల ధనుర్మాసంలో శ్రీవైష్ణవ ఆలయాల్లో పలు పూజలు కొనసాగుతాయి. ఈ ధనుర్మాసం ఉత్సవాలలోనే పవిత్రమైన వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వైకుంఠ నాథుడు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం నుంచి దర్శనమిస్తారు. భోగి పండుగ రోజున గోదాదేవి, రంగనాథున్ని వివాహ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే అత్యంత పుణ్యకాలమైన ఉత్తరాయన సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు.

ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ వైష్ణవ క్షేత్ర మైన జెండా బాలాజీ మందిర్, జాన్కంపేట్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, భీంగల్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం, చక్రంగుడి వేంకటేశ్వర ఆలయం, సుభాష్‌నగర్ రామాలయం, ఆర్యనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఉత్తర తిరుపతి క్షేత్రం, పోచంపాడ్ రామాలయం, అపురూప వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆర్మూర్ కోదండరామాలయం, బోధన్ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఖిల్లా రఘునాథ ఆలయం, ఏడవ బెటాలియన్ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఇందల్వాయి రామాలయం, నర్సింగ్‌పలి వేంకటేశ్వర ఆలయం, డిచ్‌పల్లి రామాలయం, తదితర ఆలయాలు ధనుర్మాస ఉత్సవాలకు ముస్తాబు చేశారు.

ఉమ్మడి జిల్లా అంతటా ఘనంగా దత్త జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం


సిద్ధుల గుట్టపై దత్త జయంతీ వేడుకల్లో పాల్గొన్న భక్తులు


తిమ్మాపూర్‌లో ..


బోధన్ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో..

కోటగిరి,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తి భావనను అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని బస్వాపూర్ గ్రామంలో దత్త ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు.ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. రుణమాఫీతో పాటు బోనస్ రైతులకు అందించిందన్నారు.యాసంగిలో పంటలు సరిపడ సాగునీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్,నాయకులు శ్రీధర్, ఏఎంసీ చైర్మన్ హన్మంతు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని శబరిమాత ఆశ్రమంలో ఆదివారం ఘనంగా దత్తజయంతి, వెంకటేశ్వర కళ్యాణాలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ గురు చరిత్ర పారాయణం, గోమాత పూజ, ధ్వజారోహణం, భిక్షాటన మహాత్ముల సందేశములు, భజనలు, శ్రీరామ నామ సంకీర్తనలు, డోలారోహణ మహోత్సవము, రథోత్సవమును ఆదివారం నిర్వహించారు.మండలం నుండే కాక వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ప్రత్యేక భజ నలు, కీర్తనలు చేశారు. భక్తుల సౌక ర్యార్థం అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమ వారం రోజున పాదుక పూజ మహోత్సవం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, వివిధ యువజన సం ఘాల సభ్యులు,అభివృద్ధికమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బీర్కూర్: తిమ్మాపూర్ గ్రామ పరిధిలోని దత్తాత్రేయ స్వామి వారి ఆలయంలో ఆదివారం దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారికి సుప్రభాతం, కాకడహారతి, పాదపూజ, బిల్వార్చన, అష్టోత్తర నియమావళి, పంచామృత అభిషేకం, యజ్ఞం, భజన సంకీర్తనల మధ్య డోలారోహణం నిర్వహించారు. ఆలయ సన్నిధిలో కమిటీ సభ్యులు భక్తులకు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు.

పిట్లం:మండలంలోని దత్తాత్రి ఆలయాలలో దత్త జయంతీ సందర్భంగా భక్తులు ఉదయం నుండే ఆలయాలకు చేరుకొని ప్రత్యేకంగా పూజలు చేశారు. సిద్ధుల గుట్టపై దత్తాత్రేయ ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తుల పూజల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.ఆలయ అర్చకులు దత్త జయంతీ సందర్భంగా దత్తాత్రేయుని ఊయలలో వేసి పాటలు పాడారు.

బాన్సువాడటౌన్: పట్టణంలోని పెద్దహనుమాన్‌మందిరం , శ్రీరామ మందిరం , చైతన్యకాలనీ దత్త మందిరాల్లో ఆదివారం దత్తజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి అర్చకులు దత్తాత్రేయునికి అభిషేకం , అర్చనలు చేపట్టారు. వేదమంత్రాలతో మధ్యాహ్నం జనన కార్యక్రమం జరిపించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు ఉడుగుల ఈశ్వరయ్య గుప్త కుటుంబ సభ్యులు భక్తుల కోసం అన్నప్రసాద వితరణ గావించారు.ఈకార్యక్రమంలో దత్తుమహారాజ్,మధుసూధనశర్మ,సంజీవ్‌కుమార్,విజయలక్ష్మీ,శ్రీనివాస్,స్వాతి,నాగరాజుస్వప్న,శకుంతల,సుదీప్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మోస్రా, చందూర్ మండల కేంద్రాల్లోని రామాలయ కమిటీ ఆధ్వర్యంలో దత్తాత్రేయ జయంతి సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపనను నిర్వహించారు. అనంతరం విగ్రహ దాత ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, మండల కేంద్రంతో పాటు ఆయాగ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కోటగిరి: రుద్రూరు మండలంలోని సులేమాన్ నగర్ గ్రామంలోని గైని గుట్ట స్వయంభు బసవేశ్వర ఆలయం వద్ద గల దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఆదివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి పరమేశ్వర్ మహరాజ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లింగమయ్య గుట్ట శివాలయం 5వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం దత్తాత్రేయ పూజ, దత్త హోమం, దత్త ఊయల, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

● బినోల, నాళేశ్వర్‌లలో..

మండలంలోని బినోల, నాళేశ్వర్‌లలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలల్లోని దత్తాత్రేయ ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకం, తొట్లె, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో గల దత్తాత్రేయ ఆలయంలో ఆదివారం ఘనంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా ఉదయం నుండే భక్తులు ఆలయానికి తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌రావు కులకర్ణి మాట్లాడుతూ దత్తాత్రేయుడిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. భక్తులు ప్రతిరోజు ఆలయ దర్శనం చేసుకోవాలని సూచించారు. కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పబ్బ మురళి, శేఖర్, వెంకట రమణ రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

● పెగడాపల్లిలో

బోధన్ మండలంలోని పెగడాపల్లిలో పోచమ్మ ఆలయం 5వ వార్షికోత్సవం సందర్భంగా యజ్ఞ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. దత్త పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య యజ్ఞం, హోమం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీఅధ్యక్షుడు జిన్నలింగారెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం దత్త జయంతిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జక్రాన్‌పల్లి, తొర్లికొండ, అర్గుల్, కలిగోట్ చింతలూర్, కేశ్‌పల్లి, సికింద్రాపూర్, బ్రహ్మణ్‌పల్లి, మునిపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు, భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం బాల్కొండ మండలంలోని చిట్టాపూర్, బోదేపల్లిలో సాయిబాబా ఆలయంలో భక్తులు ఉదయం బారులు తీ రారు. దత్తపూర్ణిమ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, యజ్ఞం, నవగ్రహపూజ, పూలతో అలంకరించారు.

దత్తాపూర్‌లో..

మండలంలోని దత్తాపూర్ గ్రామంలో దత్త జయంతి వేడుకలను అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ఉదయం నుంచి ఆలయం వద్ద అభిషేకం, అర్చనలు, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సురేష్, వైస్‌చైర్మన్ నర్సయ్య, క్యాషియర్, సుంకరి బుర్రన్న(రాజు) శ్రీనివాస్, మహేష్, నరేష్, రాజన్న, మల్లన్న, నాగభూషణ్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: మండలంలో దత్తపౌర్ణమి వేడుకలను ఆలయాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగించారు. పవిత్ర పుణ్యక్షేత్రం గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దత్తపౌర్ణమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


మోస్రాలో..


సులేమాన్‌నగర్‌లో ..


లింగమయ్య గుట్టలో..


మెండోర ఆలయంలో స్వామివారి పల్లకీసేవ

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయాలి


ఏర్గట్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం మాట్లాడుతూ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు కాక పోగా కాంగ్రెస్ నాయకులు ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవడం వి డ్డూరంగా ఉందన్నారు.ఈకార్యక్రమంలో మా జీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ఈరపట్నం నర్స య్య, పీఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్ననర్సయ్య, వైస్ చైర్మన్ సింగసారం గంగా రాం, బద్ధం హన్మండ్లు, కొలిప్యాక శ్రీను, రొక్కెడ మోహన్, బద్ధం శ్రీనివాస్ రెడ్డి, జైనోద్దీన్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సాటాపూర్ మాజీ సర్పంచ్‌కు జాతీయ అవార్డు

రెంజల్,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సర్పంచ్ జాతీయ అవార్డు-2024సంవత్సరానికి గాను నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామ తాజా, మాజీ సర్పంచ్ వికార్ పాషా అవార్డును అందుకున్నరు. ఆదివారం దేశ రాజధాని న్యూ ఢిల్లీలో ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో జరిగిన బహుజనసాహిత్య అకాడమీ 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ జాతీయ ప్రధాన కార్యదర్శి డా.యు.సుబ్రమణ్యాన్ చేతుల మీదుగా వికార్ పాషా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షులు మన్వీర్ సింగ్, పర్సియ్,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టయ్య ఫారం తండాకు చెందిన కేతావత్ పీర్‌చంద్(35)అనే వ్యక్తి శనివారం గుర్తు తెలియని పురుగుల మందును తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ వినయ్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి మట్టయ్య ఫారం గ్రామానికి చెందిన పీర్‌చంద్ తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమిని సాగు చేసుకుని జీవిస్తున్నాడు. ఉపాధి నిమిత్తం 8సంవత్సరాల క్రితం పీర్‌చంద్ అప్పు చేసి దుబాయ్ వెళ్లాడు. అక్కడ రెండు సంవత్సరాల పాటు ఉన్నప్పటికీ సరైన పని లభించలేదు. దీంతో ఆరు సంవత్సరాల క్రితం తిరిగి స్వగ్రామానికి వచ్చి తనకున్న కొద్దిపాటి వ్యవసాయం చేసుకుంటున్నాడు. గతంలో దుబాయ్‌కి వెళ్లిన అప్పులు పెరిగిపోవడంతో పాటు ఇక్కడ కూడా సరైన ఆదాయం లేకపోవడంతో తిరిగి దుబాయ్ వెళ్లడానికి అప్పులు చేయడానికి యత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం తన ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందును సేవించాడు. వెంటనే అతనిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మండల మేరు సంఘం అధ్యక్షుడిగా యజ్ఞపాల్

మోర్తాడ్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండల మేరు సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా తడ్ పాకల్‌కు చెందిన మేరు సాయన్న ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో మోర్తాడ్ మండల అధ్యక్షుడిగా రామగిరి యజ్ఞపాల్, ఉపాధ్యక్షుడిగా శెట్‌పల్లికి చెందిన కోడిగంటి భూమేశ్వర్‌లు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కొత్తింటి గ్రామానికి చెందిన ఓడపల్లి శ్యామ్, కోధికారిగా ధర్మోరాకు చెందిన పొల్కం రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన మేరు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ టీచర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని అంబం మోడల్ స్కూల్‌లో ఫిజిక్స్ టీచర్ నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్ సబ్జెక్టులో పీజీ చదివి బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగి ఉన్న వారు ఈ నెల 17వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవం


బాల్కొండలో బ్రహ్మంగారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ముప్కాల్,డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందంబ కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం పురోహితులు ప్రవీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని ముందుగా ఎదుర్కోలు నిర్వహించి కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. అనంతరం పూర్ణహుతి కార్యక్రమాన్ని నిర్వహించా అన్నదానం నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

● వైభవంగా లక్ష్మీ నరసింహుని కల్యాణం

ఏర్గట్ల: మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యామహోత్సం వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం రథోత్సము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కూచయ్య, ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మండలంలోని భక్తులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో ఘనంగా మల్లన్నస్వామి జాతర


ఆలూర్‌లో మల్లన్నస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

ఆర్మూర్‌రూరల్ డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో మల్లన్నస్వామి (కండె రాయుడు) జాతర, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. డప్పులు, డోలు వాయిద్యాలతో భక్తులు రథం (షిడే)ను ఆలయం చుట్టూ 19సార్లు ప్రదక్షిణలు చేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్లెం మోహన్, మాజీసొసైటీ చైర్మన్‌లు మోహన్‌రెడ్డి, కల్లెం బోజారెడ్డి, మాజీఎంపీటీసీ మర్కంటి మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, ముక్కెర విజయ్, దుమ్మాజి శ్రీనివాస్, వీడీసీసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండలం గ్రామ శివారులో సోమవారం జరగనున్న జాతర ఉత్సవాలకు ఆదివారం రాత్రి రథం(షిడే) గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్టపై వెలిసిన సంత మల్లన్న ఆలయం వరకు నగర డోలు వహిస్తూ డప్పువాయిద్యాల మధ్య తీసుకువచ్చారు. సోమవారం ఉదయం జరిగే జాతర, రథోత్సవాలకు సంబంధించి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులోనో దూల గుట్టపై కొలువుదీరిన యాదవుల ఆరాధ్య దైవం మల్లన్న స్వామి కల్యాణం, జాతరా ఉత్సవాలు, అనంనదాన కార్యక్రమాలు సోమవారం నిర్వహించనున్నట్లు గ్రామ యాదవ సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి దేవన్న ముకేష్, బైకాని మహేష్, చిన్నయ్య, నడ్పన్న, రామకృష్ణ, ఆశన్న, సభ్యులు పాల్గొన్నారు.

ధర్పల్లి: దర్పల్లి గ్రామశివారులో గల మల్లన్న దేవుని ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గత 15రోజులు నియమనిష్టలతో మల్లన్నదేవునికి ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఉత్సవాల్లో కుర్మ యాదవులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వాహకులు అన్నదానం ఏర్పాట్లు చేశారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామంలో సోమవారం జరగనున్న కొమురవెల్లి అగ్గిమల్లన్నస్వామి, జాతర, రథోత్సవానికి గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం రథం (షిడే) ఊరేగింపు నిర్వహించి మల్లన్నస్వామి ఆలయానికి తీసుకువెళ్లారు.

రాష్ట్ర సీడ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా మురళీ

మోర్తాడ్; డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సీడ్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రొక్కం మురళీ నామిటేడ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ నియమకాన్ని ఏబీసీ ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ప్రభుత్వ ఆర్డర్‌ను విడదల చేశారు. రొక్కం మురళీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు. తన నియమకాన్ని సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీమంత్రి, బోదన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కార్పోరేషన్ చైర్మన్‌లు, రొక్కం మురళీ కృతజ్ఞతలు తెలిపారు.

చెరువులో పడి పశువుల కాపారి మృతి

ముప్కాల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో పశువుల కాపారి ముక్క చిన్న సాయిలు(40) గేదెలను కాపాడబోయి మృతి చెందాడు. సంఘటన సంబంధించిన ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం .కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామం నుంచి రెంజర్ల గ్రామానికి వచ్చాడు. రెంజర్ల గ్రామంలో గేదెలను కాపారిగా పని చేస్తుండగా ఎప్పటిలాగే శనివారం గేదెలను మేతకు వెళ్ళాడు. మధ్యాహ్నం 3గంటలకు చెరువులో గేదెలకు నీటిని తాగించడానికి తీసుకువెళ్లగా కొన్ని గేదేలు చెరువులోకి వెళ్లగా వాటిని బయటకు తీసుకురావడానికి నీటిలోకి వెళ్ళి ప్రమాదవశాత్తు ఈత రాక చిన్నసాయిలు చెరువులో మునిగిపోయి ఆదివారం సాయంత్రం నీటిలో శవమై తేలగా, మృతుని భార్య మక్కల కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నిర్మల్ యువకుడి మృతి

● మరో యువకుడికి తీవ్రగాయాలు

ముప్కాల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని 44వ నేషనల్ హైవేపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిర్మల్‌కు చెందిన ఎండి.అద్నాన్(20) అనే యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రగాయాలయ్యాయి.సంఘటనకు సంబంధించిన బాల్కొండ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్‌కు చెందిన మృతుడు అద్నాన్, దిలావర్‌పూర్‌కు చెందిన తన ఫ్రెండ్ షేక్ ఫైసల్ పని నిమిత్తం నిజామాబాద్‌కు బజార్ పల్సర్ బైక్‌లపై బయలు దేరి వెళ్లారు. మార్గ మధ్యంలో బాల్కొండ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అద్నాన్ అక్కడికక్కడే మృతి చెందగా, ఫైసల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో మురికికాలువలో నాందేడ్ జిల్లా షిబ్బారా గ్రామానికి చెందిన సోనాజిగాంధీ శామల్‌వార్(60) కాలువలో పడి మృతి చెందాడు. గత కొన్నేళ్లుగా పెర్కిట్‌లో కూలి పని చేసుకుంటూ కుటుంబసభ్యులతో జీవిస్తున్నాడు. శనివారం మాటుకాలువలో చేపలు పడుతుండగా ప్రమాద వశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మండలంలో వరుస బైక్‌ల చోరీలు

ఎడపల్లి, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలో గత నెల రోజులుగా ఏదో ఒక చోట బైకు చోరీలు జరుగుతూనే ఉన్నాయి. గత 15 రోజుల క్రితం మండలంలోని జానకంపేట గ్రామంలో ఒకేసారి రెండు రోజుల వ్యవధిలో 3 బైకులు చోరీలకు గురయ్యాయి. ఒక బైకును చోరీ చేసిన దొంగ ఏకంగా బైకు రంగునే మార్చాలని చూసి స్థానికులకు దొరికిపోయాడు. అతడిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఇలా మండలంలో ఎక్కడో ఓచోట బైకులు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా దొంగలు జాగ్రత్త పడుతున్నారు. తాజాగా ఆదివారం బోధన్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన సిద్దోళ్ళ హన్మాండ్లు అనే వ్యక్తి ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన ఆకుల శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనులు చేయడానికి వచ్చి తన బైకును వాగుకు అవతలి ప్రక్కన పెట్టి వ్యవసాయ పనులు చేయడానికి వెళ్లాడు. పని ముగించుకుని వచ్చి చూసేసరికి తన బైకు కనిపించకపోవడంతో చుట్టు ప్రక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు

మోర్తాడ్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఈనెల 21, 22తేదీల్లో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలో విజేతలకు ప్రథమ రూ.10వేలు, ద్వితీయ రూ.5వేలు, షీల్డ్‌లు అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు తమ ఎంట్రీలను ఈనెల 19న సాయంత్రం 5గంటల లోపు ఇవ్వాలని తెలిపారు. ఎంట్రీలను ఫిజికల్ డైరెక్టర్ ఆనంద్, 8985610844, పీఈటీ సింధుజ 9603306171, సీహెచ్.సందీప్ 8500999930 నెంబర్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

రామారెడ్డి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రామారెడ్డి ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన ఉరిమి శెట్టి స్వామి (38) గత కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బీపీ పెరగడంతో, తీవ్ర మనస్థాపం చెంది స్వంత పొలంలో మామిడి చెట్టుకు నైలాన్ తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనకు స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి భార్య ఆత్మహత్య సమయంలో చెట్టుకొమ్మ విరిగి చెంపపై గాయమైందని భార్య ఉరిమిశెట్టి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ వివరించారు.

ఎస్‌డీఎఫ్ నిధులతో అదనపు గదుల నిర్మాణం

ఏర్గట్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలోని యాదవ సంఘంలో అదనపు గదుల నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ ద్వారా లక్షలు మంజూరీ కాగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నిధుల మంజూరీకి కృషి చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, దేశబోయిన చిన్నసంజీవ్, కాంగ్రెస్ నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 15: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయా పూర్తిస్థాయి నిర్మాణం నిమిత్తం మెట్‌పల్లికి చెందిన వ్యాపారవేత్త దికొండ సాయికృష్ణ ఉమన దంపతులు తమ వంతుగా 25 వేల విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా విరాళం అందించిన దంపతులను నిర్వహన బాధ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బద్రి, బద్దం రాజేష్ తదిత అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నెల జీతం ప్రకటించిన అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిప్రిరోడ్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ అన్వేష్‌రెడ్డి తన నెల జీతాన్ని అందజేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం గురుకుల పాఠశాలలో డైట్ మెనును ప్రారంభించడానికి వెళ్ళిన ఆయన హాస్టల్ స్థితిగతులను పరిశీలించి గత పదేళ్లు హాస్టల్‌ను పట్టించుకునే నాథుడే లేడని, విద్యార్థుల అవసరాల కోసం తన నెల జీతాన్ని ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



పందుల సంచారం



ముళ్ళపొదలతో నిండిపోయిన హౌజింగ్‌బోర్డు వెళ్ళే రోడ్డు

అధ్వానంగా డ్రైనేజీ

పెర్కిట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు వెళ్ళే దారి మురికికాలువలు, చెత్తకుప్పలతో అధ్వానంగా తయారైంది. దారి పొడవున ఉన్న డ్రైనేజీ చెట్లపొదలతో నిండిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే ఓ ఫంక్షన్‌హాల్ నుంచి వచ్చే మురికినీరు, ఆహార వ్యర్థాలు, ప్లాస్టిక్‌వ్యర్థాలతో ఆ ప్రాంతం అంతా మురికికుపంలా తయారైంది. పందులు, కుక్కలు సంచరించడంతో ఆ దారిలో వెళ్ళేందుకు ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. చాలాసార్లు రాత్రివేళల్లో ఆ మార్గంలో వెళ్ళేటప్పుడు చెట్ల పొదలలో ఉన్న డ్రైనేజీ గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో వీధిలైట్లు పనిచేయనందు వల్ల పాదచారులు, వాహనదారులకు రోడ్డుపక్కనే ఉన్న డ్రైనేజీతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్మూర్ మున్సిపల్‌లో సమస్య గురించి తెలిపిన పరిష్కారం కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు చెట్ల పొదలను ఎప్పటికప్పుడు తొలగించాలని, అలాగే పొదల మధ్యలో నిండి ఉన్న డ్రైనేజీని చెత్తను తొలగించి ప్రమాదాలు జరుగకుండా డ్రైనేజీ నిర్మాణం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చెట్లపొదలను వెంటనే తొలగించాలి...

● గంగాధర్, స్థానికుడు

హౌజింగ్‌బోర్డు కాలనీకి వెళ్ళేదారిలో ఓ ఫంక్షన్‌హాల్ వద్ద మూలమలుపు డ్రైనేజీ చెట్ల పొదలతో నిండిపోయింది. రాత్రి సమయంలో, వర్షాకాలంలో ఈ దారి గుండా వెళ్ళడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే మున్సిపల్ అధికారులు డ్రైనేజీ చుట్టు పక్కల పొదాలను తొలగించి, డ్రైనేజీ నిర్మాణం చేయాలి.

నిరుపయోగంగా పసుపు పరిశోధన కేంద్రం

●ధర్పల్లి మండల కేంద్రంలో ఏర్పాటు

● వినియోగంలోకి తీసుకురాని అధికారులు



పసుపు పరిశోధన కేంద్ర భవనం

ధర్పల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మించిన పసుపు పరిశోధన కేంద్రం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంది. పసుపు రైతులకు అండగా ఉండేందుకు గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏప్రిల్ 8, 2008లో ఉన్నత విద్యాశాఖమంత్రి ధర్మపురి శ్రీనివాస్ ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎస్‌జిఎస్‌వై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రత్యేక పథకం కింద పసుపు సామర్థ్య సౌలభ్య కేంద్రానికి రూ.35లక్షల 85వేలు మంజూరు చేశారు. భవననిర్మాణం పనులు రెండు సంవత్సరాలుగా కొనసాగి చివరకు పూర్తిచేశారు. అప్పటి నుంచి ఈ భవనం అందుబాటులో లేక పసుపు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పసుపు సౌలభ్యం కేంద్రం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో విలువైన వస్తువులను అపహరించుకుపోయారు. ఈ కేంద్రం ప్రస్తుతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. పసుపు రైతు ఆవేదన అంతా ఇంతా కాదు ఏ రకం విత్తనం వేయాలో ఏ పద్ధతిలో పసుపు పంటను పండించాలో తెలియక పసుపు రైతులు అగచాట్లు పడుతున్నారు. పండించిన పసు పు పంటకు తెగుళ్ల సోకినప్పుడు సలహాలు, సూచనలు ఇచ్చే శాస్త్రవేత్తలు లేక నానాటికి పసుపు పంటను వేసేందుకు రైతులు విముకత వ్యక్తం చేశారు. ధర్పల్లి, సిరికొండ, భీంగల్, ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లో పసుపు రైతులకు గాను ఈ పసుపు పరిశోధన కేంద్రం రైతులకు సౌకర్యంగా ఉంటుందని ఇక్కడ నిర్మించారు. పసుపు సాగులో మెలకువలు, కొత్త మార్పులు, సాగు విధానం, నూతన వంగడాలు, శాస్త్రవేత్తల సలహాలు అందించే ఉద్దేశ్యంతో ఈ నిర్మాణాన్ని చేపట్టారు. భవ నాన్ని మాత్రం నిర్మించారు కానీ ఈ భవనంలో తగిన సిబ్బం దిని కేటాయించకపోవడంతో దశాబ్దకాలంగా నిరుపయోగంగానే పడి ఉంది. అధిక మొత్తంలో పసుపు పంట పైన పెట్టుబడులు పెట్టి ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాణ్యమైన పసుపు సాగును సలహాలు, సూచనలు అందించేందుకు నిర్మించిన ఈ కేంద్రంలో శాస్త్ర వేత్తలను, సిబ్బం దిని నియమించకపోవడంతో ఎవరూ లేక భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పరిశోధన కేంద్రాలకు అవసరమైన శాస్త్రవేత్తలు, సిబ్బందిని కేటా యించకపోవడంతో లక్ష్యానికి దూరంగా ఈ కేంద్రం మరుగున పడి ఉంది. అప్పట్లో ధర్పల్లితో పాటు కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లో భూమిని కొనుగోలు చేసి భవనాల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం కమ్మర్‌పల్లి మండలంలో మాత్రమే పసుపు పరిశోధనలు జరుగుతున్నాయి. జిల్లాలో ఆర్మూర్, బాల్కొండ, నందిపేట్, జక్రాన్‌పల్లి, మెండోరా, వేల్పూర్, మోర్తాడ్, ఏర్గట్ల, ముప్కాల్, కమ్మర్‌పల్లి, ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాల్లో అత్యధికంగా పసుపుపంటను రైతులు సాగుచేస్తున్నారు. ఆధునిక యాంత్రీకరణ విధానాలు మెళకువలు తెలియకపోవడంతో రైతులు గతంలో చేసిన విధంగానే పసుపు పంటను సాగుచేయడంతో దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పసుపు పరిశోధన కేంద్రానికి సిబ్బంది, శాస్త్రవేత్తలను నియమించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న గిడ్డంగులు

సిబ్బందిని కేటాయించి రైతులను ఆదుకోవాలి...

● మిట్టపల్లి వెంకట్‌రెడ్డి, రైతు



మండల కేంద్రంలో గల పసుపు పరిశోధన కేంద్రానికి శాస్త్రవేత్తలను, సిబ్బంది కేటాయించాలి. మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పసుపు పం డించే రైతులు అధికంగా ఉన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మెళకువలను నేర్పేవిధంగా శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు ఇవ్వాలి.



శిలాఫలకం

ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యేను కలిసిన మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్

డిచ్‌పల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి డిచ్‌పల్లి మాజీ ఎం పీపీ కంచెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయ కులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. వర్సిటీ లోనే ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుతో పేదవిద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యేకు వివరించినట్లు ఇందుకు ఎమ్మె ల్యే సానూకులంగా స్పందించినట్లు గంగాధర్ తెలి పారు. గ్రామాల్లో బీటీ రోడ్లు, అర్హులైన వారికి ఇంది రమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలి పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయ కులు సుబ్బన్న, వడ్ల గంగాధర్, సుద్దపల్లి నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఘనంగా పడిపూజ



హారతి ఇస్తున్న భక్తులు

బోధన్‌రూరల్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): ఓం.. ఓం.. అయ్యప్ప.. శరణం.. శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప శరణ ఘోషతో అయ్యప్ప స్వాముల పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు, ఇందూర్ పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయ అర్చకులు సంతోష్ మహరాజ్, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. 18మెట్లను పూలతో అందంగా అలంకరించి గణపతి, కుమారస్వామి, అయ్యప్ప విగ్రహాలను ప్రతిష్ఠించి పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడిపూజకు అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 18మెట్లకు కర్పూర హారతులు ఇచ్చి భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించారు. పడిపూజకు అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో హజరూన భక్తిశ్రద్ధలతో భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి గ్రామంలో దత్తజయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

దత్తాత్రేయ జయంతి

డిచ్‌పల్లి, డిసెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి సద్గురు రాఘవ స్వామి ఆశ్రమంలో దత్తాత్రేయుని జయంతి భక్తుల ఆనం దోత్సవాల నడుమ జరిగాయి. ఆశ్రమ నిర్వహకనణకర్త కృష్ణ నంద స్వామి ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు గీతోపదేశం చేశారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడుచుకోవాలని వేడుకలకు మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం లో హరికిషన్, లక్ష్మణ్, శ్రీధర్, మురళి పాల్గొన్నారు.

అధ్వానంగా యూనివర్సిటీ శిలాఫలకం

పట్టించుకోని అధికారులు



పెచ్చులూడిన టీయూ శిలఫలకం

డిచ్‌పల్లి డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 15ఏళ్ల క్రితం జాతీయ రహదారి పక్కన అప్పటి సీఎం వైఎస్ఆర్ ప్రారంభించిన శిలఫలకం పెచ్చులూడిపోయి అధ్వాన్నంగా తయారైంది. ఇది వరకు శిలఫలకానికి చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ కంచే అగ్నికి ఆహుతి అయింది. యూనివర్సిటీ స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేయాల్సిన శిలఫలకం అధికారుల పర్య వేక్షణ లోపంతో అమాత్యుల పేర్లు ఊడిపోయి కళావిహీనంగా మారింది. ప్రత్యేక రాష్ట్రంతో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ శిలాఫలకం వర్సిటీ ఉన్నతాధికారులు చర్యలు తీపుకొని వర్సిటీ స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరు తున్నారు.

రైలు కింది నుంచి ప్రమాదకర ప్రయాణం



రైలు కింద నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న ప్రజలు

డిచ్‌పల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ నుంచి పక్కన గల ఘన్‌పూర్, ముల్లంగి, కులాస్ పూర్, గ్రామాలకు వెళ్లే గ్రామీణ ప్రజలు పలు శాఖాల్లో పనిచేసే అధికారులు పిల్లపాపలతో వెళ్లే గ్రామాల ప్రజలు నిత్యం ఆగివున్న రైలు కింది నుంచి ప్రమా దకరంగా వెళ్తున్నారు. ఫుట్ ఓవర్ వంతెన లేక ఇలా ప్రమాదకరంగా వెళ్లడం ఈ గ్రామాల ప్రజలకు పరిపాటిగా మారింది. రెండు రోజులుగా మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ లో రైలు నిలిపివుంచడంతో గ్రామీణ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల రైల్వే ఉన్నతాధికారులకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పై గ్రామీణ ప్రజలు వినతి పత్రాలు అందజేసినా అధికారులు మాత్రం ఏలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైల్వేఅధికారులపై గ్రామస్థులు మం డిపడుతున్నారు. వెంటనే వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి..

ఇక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ప్రజలసమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానిక నాయకులు కోరుతున్నారు. ఇందు కోసం రైల్వే అధికారులకు వినతి పత్రం కూడా ఇచ్చారు.



రైలు కింద నుంచి వెళ్తున్న పలు గ్రామాల ప్రజలు



పట్టాలపై నడుచుకుంటూ వెళుతున్న మహిళ

ఇంటర్ భవనంలో..

డిగ్రీ తరగతులు

● పక్కా భవనం లేక, జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ తరగతులు

● కళాశాల మంజూరై రెండు ఏళ్లు గడిచినా ప్రారంభం కాని పనులు

● డిచ్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాల భవనం ఇదే



డిగ్రీ కళాశాల

డిచ్‌పల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల కేంద్రంలో గత కొన్నేళ్లుగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే డిమాండ్ దృష్ట్యా గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ శాసనసభ్యులు ప్రత్యేక చొరవ చూపి డిచ్‌పల్లి మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయించారు. కానీ భవనానికి నిధుల మంజూరు కాకపోవడంతో ప్రస్తుతం ఉన్న జూనియర్ కళాశాలలోనే డిగ్రీ తరగతులు నిర్వహిస్తున్నారు. డిగ్రీ కళాశాల కోసం కొన్న తరగతి గదులను కేటాయిం చారు. ఇరుకుగా మారిన ప్రభుత్వ జూనియర్ కళాశా లలోనే డిగ్రీ తరగతి గదులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడతున్నారు. సరైన మౌలిక సదుపాయాలు లేక క్రీడామైదానం లాంటి సౌకర్యాలు విద్యార్థులకు అందని ద్రాక్షగానే మారిపోయింది. 2023-24 విద్యాసంవత్సరంలో ప్రారంభమై డిగ్రీ కళాశాల డిచ్‌పల్లి జూనియర్ కళాశాల భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేయడంలో అధికారులు, నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని అపవాదు వినబడుతుంది. 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ లో బీఏ,బీకాం, బీఎస్సీ, బీజెడ్‌సీ కోర్సులతో ప్రారంభించారు. ఈ విద్యాసంవత్సరంలో అన్ని కోర్సుల్లో కలిపి 30 మంది నూతనంగా ప్రవేశం పొందారు. విద్యార్థులకు బోధన చెప్పేందుకు అధ్యాపకుల కొరత ఇక్కడ తీవ్రంగా వేధిస్తుంది.



కళాశాల ప్రాంగణం

ఎమ్మెల్యే డా. భూపతిరెడ్డి వెం టనే స్పందించి డిచ్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనంకు నిధులు మంజూరు చేయాలని, అధ్యాపకులను కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిగ్రీ కళాశాల ద్వార డిచ్‌పల్లి మం డలంతో పాటు ఇందల్వాయి, మోపాల్, జక్రాన్‌పల్లి మండలాలకు విద్యార్థులకు సౌకర్యంగా మారనుంది. కావున డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏరాక్షైటు చేయాలని కోరుతున్నారు.

ప్రస్తుతం కొనసాగుతున్న జూనియర్ కళాశాల భవనం ఎదుట కనీసం డిగ్రీ కళాశాల పేరుతో బోర్డు సైతం లేకపోవడం గమ నార్హం. డిచ్‌పల్లి డిగ్రీ కళాశాలతో పాటు రాష్ట్రంలో మంజూరైన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ డిగ్రీ కళాశాల వంటి వాటికి ప్రభుత్వం అధ్యాపకులను కేటాయిం చిన, ఇక్కడి కళాశాలపై మాత్రం నిర్లక్ష్యం చూపి అధ్యాపకులను నియమించలేదు. దీంతో విద్యార్థులకు డిగ్రీ విద్యకు దూరం అవుతున్నారు.



నగరంలో కమ్ముకున్న పొగమంచు

ఇందూరు గజ గజ..

● జిల్లాలో భారీగా తగ్గిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు ● ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, వృద్ధులు ● కోటగిరిలో 7.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చలి తీవ్రతతో జిల్లా గజ గజలాడుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జిల్లా ప్రజలు చలి తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. గత వారం రోజుల క్రితం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో తుఫాను కారణంగా చలి తీవ్రత తగ్గగా గత రెండు, మూడు రోజులుగా జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. జిల్లాలో ఆదివారం రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. కోటగిరిలో 7.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, గూపన్‌పల్లిలో 8.3, మెండోరా, పోతంగల్‌లో 8.7, సాలూరాలో 9.2, పాల్దాలో 9.3, మదన్‌పల్లిలో 9.5, సీహెచ్ కొండూరు, తూంపల్లిలో 9.6, పెర్కిట్, జాన్కంపేట్, నిజామాబాద్‌లలో 9.7, చందూర్‌లో 9.8, మంచిప్పలో 9.9, ఇస్సపల్లి, బాల్కొండ, మోర్తాడ్‌లలో 10 డిగ్రీలు, రుద్రూర్, డిచ్‌పల్లిలలో 10.1, జక్రాన్‌పల్లి, రెంజల్, బెల్లాల్, భీమన్‌పల్లి, చిన్నమావంది, నవీపేట్‌లలో 10.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. చలి తీవ్రత నుంచి ప్రజలు రక్షణ పొందేందుకు చలి మంటలను, రూమ్ హీటర్లను, స్వెటర్లు, మఫ్లర్లను ఆశ్రయిస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలు, వృద్ధుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

తిరుప్పావై ప్రవచనానికి సంపత్ కుమారాచార్య ఎంపిక

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించే ధనుర్మాస తిరుప్పావై ప్రవచనానికి నగరానికి చెందిన సేనాపతి సంపత్ కుమారాచార్య ఎంపికయ్యారు. నెలరోజుల పాటు శ్రీవైష్ణవ ఆలయంలో జరిగే తిరుప్పావై ప్రవచనానికి ఆయన ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో గోదాదేవి అందించిన తిరుప్పావై పాశురాలపై ప్రవచనం చేయనున్నారు. నగరంలోని బ్రహ్మపురిలో గల చక్రంగుడి లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో నెలరోజుల పాటు ప్రవచనం చేస్తారు.

శాస్త్రోక్తంగా సహస్ర కలశాభిషేకం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని జెండా బాలాజీ మందిరంలో ఆదివారం శాస్త్రోక్తంగా సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 1008 కలశాలను ఉంచి ముందుగా వేదపండితులు సముద్రాల శ్రీధరాచార్య, విశ్వక్సేన, వాసుదేవ పుణ్యహవచణ, స్థాపిత దేవతలకు పూజలు నిర్వహించి కలశాలలో దేవతలను ఆవాహనం చేసి యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలతో ఆలయం చుట్టూ సంప్రోక్షణ పూజలు నిర్వహించి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి మూలవిగ్రహం, ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అష్టోత్తర శతనామార్చన నిర్వహించి మహానైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, రఘునందనచార్య, విష్ణుసహస్రనామ పారాయణ భక్తులు పాల్గొన్నారు.

ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రిటైర్డ్ ఉద్యోగులకు క్రీడల పోటీలను నిర్వహించారు. పురుషులకు మల్లుస్వరాజ్యం ట్రస్ట్ భవన్‌లో, మహిళలకు సీఎస్ఐ చర్చి కంపౌండ్‌లో డిసెంబర్ 17 పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను జిల్లా గౌరవ అధ్యక్షుడు శాస్త్రుల దత్తాత్రేయ రావు ప్రారంభించారు. మహిళల ఆటల పోటీలను ఉపాధి శిక్షణ శాఖ మాజీ అధికారి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఇండియన్ టాగ్, బకెట్ హ్యాండ్‌బాల్, వాటర్ కయాన్, పాసింగ్ బాల్, లుడో, ఫాస్ట్ వాకింగ్, చెస్, తదితర పోటీలను నిర్వహించి విజేతలను ప్రకటించారు. పోటీలను జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, ప్రసాద్‌రావు, తదితరులు పర్యవేక్షించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో బస్సు జాత పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనాలు పీఎఫ్, ఈఎస్సై, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 19న నిజామాబాద్ జిల్లా కేంద్రానికి బస్సు జాతా వస్తుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. డిసెంబరు 15 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ బస్సు యాత్ర కొనసాగుతుందన్నారు. అందులో భాగంగా జిల్లా కేంద్రానికి రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి రేణుక, రాధా, సరిత, లక్ష్మీ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

● వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు ● ప్రధాన ఆలయాల్లో హోమాలు, నామకరణ ఉత్సవాలు, అన్నప్రసాదాలు



నగరంలోని దత్తాత్రేయ ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దత్తాత్రేయ ఆలయాల్లో జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా సాగాయి. వేడుకల్లో భాగంగా దత్తాత్రేయ ఆలయాల్లో వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో దత్తాత్రేయుడికి అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై దత్తాత్రేయుడికి నామకరణోత్సవం, హోమాలు చేశారు. స్వామికి ప్రీతికరమైన బిక్షాటన ద్వారా లభించిన బియ్యం, కూరగాయలతో అన్నప్రసాదాలను భక్తులకు అందజేశారు. పలు ఆలయాల్లో ఉదయం ప్రారంభమైన వేడుకలు సాయంత్రం వరకు సాగాయి. జిల్లాలోని ప్రసిద్ధ దత్త ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● నగరంలోని దత్తాత్రేయ ఆలయాల్లో..

నగరంలోని అతిపురాతనమైన సంత్ ఆచార్య దత్తాత్రేయ ఆలయంలో జయంతి వేడుకలు ఘనంగా సాగాయి. స్వామికి అర్చకులు మనోహర మహరాజ్, మాధవ్‌శర్మ, యోగేష్ మహారాజ్‌లు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, యోగేష్, వినాయక్, మారుతి శర్మ, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక వినాయక్‌నగర్‌లో గల సద్గురు ధామము ధార్మిక సేవా సంస్థ దత్తాత్రేయ ఆధ్వర్యంలో దత్త జయంతి వేడుకల్లో భాగంగా అభిషేకం, దత్త యజ్ఞం, కుంకుమార్చన, డోలారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. వర్నిరోడ్‌లోగల దత్త హనుమాన్ మందిరంలో దత్తాత్రేయ స్వామికి డోలారోహనం, దత్త యజ్ఞం నిర్వహించి అన్నప్రసాదాలు చేశారు. గాయత్రీనగర్‌లోగల శ్రీ గురుదత్త నిలయంలో 45వ దత్తాత్రేయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అభిషేకం, అష్టోత్తర గురుపూజ, దత్తాత్రేయ జనన, ఉయ్యాల సేవ నిర్వహించారు. న్యాల్‌కల్ రోడ్‌లోగల శబరి ఆశ్రమంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో దత్తాత్రేయుడికి అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. మాధవనగర్ సాయి బాబా దేవాలయంలో కొలువుదీరిన దత్తాత్రేయునికి అభిషేకం నిర్వహించి నామకరణోత్సవం నిర్వహించారు.

● హైందవ సంస్కృతిలో దత్త జయంతికి ప్రత్యేక స్థానం

హైందవ సంస్కృతిలో దత్త జయంతికి ప్రత్యేక స్థానం ఉందని దేశవ్యాప్తంగా హిందువులంతా ఏకతాటిపై నిలిచి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని వినాయక్‌నగర్‌లోగల సద్గురు ధామము ధార్మిక సేవా సంస్థ దత్తాత్రేయ ఆలయంలో జరిగిన జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ దత్తాత్రేయుడు సమాజంలో గురువుగా ప్రాధాన్యత ఉందని చెడు సంస్కృతిని పారదోలడానికే స్వామి మానవ అవతారంలో త్రిమూర్తి స్వరూపిడిగా అవతరించారని అన్నారు. భారతదేశంలో కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పదని కుటుంబ వ్యవస్థను ఆ పరమేశ్వరుడు ద్వారా మనం నేర్చుకోవచ్చని అన్నారు. దత్తాత్రేయుడిని ఆశ్రయించిన భక్తులకు తప్పకుండా చేపట్టిన పనిలో విజయం లభిస్తుందని అన్నారు. అనంతరం ఆలయంలో జరిగిన పూజాది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు ఇప్పకాయల హరిదాస్, ప్రసాద్, కార్పొరేటర్ ఉమారాణి, తదితరులు పాల్గొన్నారు.

'రైతాంగ ఉద్యమాన్ని అణచివేయడానికి కుట్రలు'

ఖిల్లా, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతాంగ ఉద్యమాన్ని మోదీ ప్రభుత్వం అణచివేత, ఉక్కుపాదాన్ని ప్రతిఘటించాలని అఖిల భారత ప్రగతీశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్ అన్నారు. ఢిల్లీ సరిహద్దులో ముళ్ల కంచెలు, రోడ్లపై మేకులు, ఇనుప బారీకేడ్లతో మోడి సర్కార్ చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్‌భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఢిల్లీ రైతాంగ పోరాటానికి సంఘీభావం తెలుపడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. రైతాంగ ఉద్యమంపై మోదీ ప్రభుత్వం రైతు అణచివేత, ఉక్కుపాదాన్ని ప్రతిఘటించాలని, శంభు సరిహద్దుల్లో భాష్పవాయుగోళాల ప్రయోగం సిగ్గు చేటని అన్నారు. ఢీల్లి సరిహద్దులో రైతులు శాంతియుతంగా పాదయాత్ర ప్రారంభించారని అన్నారు. హైకోర్టు సూచనల మేరకు రైతులు కాలినడకన బయలేదేరితే మీరు రైతులేనా రుజువు చేసుకోండని పోలీసుల అడ్డగించడం, రైతులను బలప్రయోగం, భాష్పవాయువు, జలఫిరంగుల ప్రయోగం సిగ్గుచేటన్నారు. రైతులను చూసి మోదీ ప్రభుత్వ భయపడుతూ రైతులను ఢిల్లీలో అడుగు పెట్టనీయకుండా చేస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలిత ప్రభుత్వాలు అన్నదాతల్ని అడ్డుకుంటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు ఎస్.సురేష్, సంఘం ప్రతినిధులు దేవరాం, కే.గంగాధర్, గుమ్ముల గంగాధర్, జి.కిషన్, పల్లపు వెంకటేష్, డి.సాయిరెడ్డి, నడ్పినాగన్న,యు.రాజన్న, బి.బాబన్న, ఆర్.దామోదర్, ఈ.రమేష్, టి.గంగాధర్, అనిస్, తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ముగిసిన విభాగ్ అభ్యాస వర్గ

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఇందూరు విభాగ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నగరంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ పాఠశాలలో నిర్వహించిన విభాగ్ అభ్యాస వర్గ విజయవంతంగా ముగిసింది. చివరి రోజు సంఘటన మంత్రి రాజుసాగర్, ఏబీవీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌లు హాజరై మాట్లాడారు. ప్రపంచంలో అతిపెద్ద విద్యార్థి సంఘం ఎబివిపి దేశంలో ఎక్కడా విద్యార్థి సమస్య ఉన్నా.. విద్యార్థి శ్రేయస్సు కోసం నిరంతరం పని చేస్తోందన్నారు. రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతుల్లో నాలుగు జిల్లాలకు చెందిన విద్యార్థి ప్రతినిధులు ఎన్నో విషయాలను, అనుభూతులను పొందారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు శివకుమార్, నగర అధ్యక్షుడు వెంకటకృష్ణ, జిల్లా ప్రముఖ ఈశ్వర్, కామారెడ్డి జిల్లా ప్రముఖ గిరి, జగన్మోహన్‌గౌడ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ డిమాండను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం 9వ రోజుకు చేరింది. 9వ రోజు నిరసనలో భాగంగా ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్నంగా నిరసన చేపట్టి తమ సమస్యను ప్రభుత్వానికి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా.. తమ గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సమ్మెకు తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు బద్రినాత్, టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యానంద్, రమేష్, తదితరులు సంఘీభావం తెలిపారు.

లగోరి క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపిక

వేల్పూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంక్సాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు లగోరి క్రీడల్లో జాతీస్థాయికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో సృజన హైస్కూల్‌లో జరిగిన లగోరి క్రీడల్లో అంక్సాపూర్ పాఠశాలకు చెందిన జీహెచ్‌ఎం మల్లేశ్వరి, అంక్సాపూర్ పీడీ దేవసుకన్య ఆధ్వర్యంలో సబ్ జూనియర్ లెవల్ విభాగంలో బాలుర క్రీడలు నిర్వహించారు. ఈ క్రీడల్లో రుచిత, శైనిత, శృతి, బాలుర విభాగంలో శ్రీకాంత్‌లు జాతీయ స్థాయిలో ఎంపికైనట్లు పీడీ సుకన్య ఈ సందర్భంగా తెలిపారు. కాగా, ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిధుల మంజూరు కోసం వినతి

డొంకేశ్వర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని మండలంలోని కాంగ్రెస్ నాయకులు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఇన్‌చార్జి మంత్రి జుపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను కలిసి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో లిఫ్టులు గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని వివరించారు. మండలంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. మారంపల్లి, డొంకేశ్వర్, దత్తాపూర్ లిఫ్టులకు మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని వారు తెలిపారు. సానుకూలంగా స్పందించిన పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కలిసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు, మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, ఉమ్మడి మండలాల లిఫ్ట్ అధ్యక్షుడు బోజారెడ్డి, దత్తాపూర్ లిఫ్ట్ చైర్మన్ రమణ, తదితరులు ఉన్నారు.



జోరందుకున్న వరినాట్లు

(...5వ పేజీ తరువాయి)

సంవత్సరం మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ రెండవ వారం లోపు తుపానులు, అకాల వర్షాలు వస్తుండటంతో ఆలోపే పంట పూర్తయ్యే విధంగా రైతులు జోరుగా వరినాట్లను కొనసాగిస్తున్నారు. పంట కాలం ముందుకు జరపడంతో పాటు ముందస్తుగా వేస్తే నష్టం తక్కువగా ఉంటుందని భావిస్తూ ఇరవై రోజుల నుంచే ఈ వరినాట్లను కొనసాగిస్తున్నారు. కూలీ, ట్రాక్టర్‌కు, ఎరువులకు ఎక్కువ మొత్తంలో డబ్బులను వెచ్చిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఒకేసారి రైతులు వరినాట్లను మొదలు పెట్టడంతో కూలీలకు కూడా డిమాండ్ భారీగా పెరిగింది.

పెరిగిన విద్యుత్ డిమాండ్

జిల్లాలో వరి నాట్లు ఒకేసారి రైతులు మొదలు పెట్టడంతో విద్యుత్ డిమాండ్ కూడా వ్యవసాయానికి పెరుగుతుంది. పది రోజుల క్రితం వరకు తక్కువగా ఉండగా ప్రస్తుతం పెరుగుతుంది. జిల్లాలో ప్రతీరోజు 8.7 మిలియన్ల యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుంది. దీనిలో ప్రస్తుతం వ్యవసాయానికి 2.4 మిలియన్ యూనిట్లు ప్రతీరోజు వినియోగిస్తున్నారు. జిల్లాలో మొత్తం లక్షా 75వేల బోరు మోటార్లు ఉన్నాయి. ప్రస్తుతం రైతులు వరినాట్లను మొదలు పెట్టడం వల్ల ప్రతీరోజు డిమాండ్ క్రమేపి పెరుగుతోంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాను కూడా వ్యవసాయానికి పెంచుతున్నారు. ఈనెలాఖరు వరకు వ్యవసాయానికే ప్రతీరోజు 3.5 మిలియన్ యూనిట్ల వరకు వినియోగం అవుతుందని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ప్రతీరోజు విద్యుత్ వినియోగం 9.5 మిలియన్ యూనిట్ల వరకు చేరుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వరినాట్లను మొదలు పెడితే ఈ వినియోగం ఎక్కువ అవుతుందని ఏప్రిల్ వరకు కొనసాగుతుందని ఆ శాఖ అధికారులు అంచనా వేయడంతో పాటు సరఫరాకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, లైన్ల మరమ్మతులు చేపట్టి సరఫరాను కొనసాగిస్తున్నామన్నారు. వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా త్రీఫేజ్ సరఫరాను కొనసాగిస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే, జిల్లాలో ఆరుతడి పంటల సాగు పూర్తయ్యిం దని, ప్రస్తుతం రైతులు వరినాట్లను మొదలు పెట్టారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. అంతేకాకుండా జిల్లాలోని రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను చేశామని, ఎరువులను అందుబాటులో ఉంచామని ఆయన తెలిపారు.



ప్రారంభిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

విశ్రాంత ఉద్యోగుల క్రీడలు ప్రారంభం

సుభాష్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖలీల్‌వాడిలో గల విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జరిగిన క్రీడా పోటీలను స్థానిక అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. విశ్రాంత ఉద్యోగులు ఏర్పాటు చేసిన పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులతో కలిసి ఆయన క్యారం బోర్డు పోటీలను ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర కీలకమైందని వారు అందించిన సేవలు మరువలేనివని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు క్రీడా పోటీల ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉద్యోగుల పాత్ర గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బోజాగౌడ్, లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా మల్లన్న ఉత్సవం

సిరికొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏడాదికి ఓసారి జరుపునే మల్లన్న ఉత్సవాలను ఈసారి యాదవులు అంగరంగా వైబవంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం పట్నం వేసిన ఒగ్గు కళాకారులు మల్లన్న చరిత్రను భక్తులకు వివరించారు. అంతకుముందు సూర్యోదయ సమయంలో భక్తులు అగ్ని గుండాలన్ని దున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కళాకారులు మల్లన్న చరిత్రను కథ రూపకంగా వివరించారు. మల్లన్న దేవుడి కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. ఉత్సవాలను తిలకించడానికి వచ్చిన భక్తుల కోసం అన్న సత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతర ఉత్సవాలకు సిరికొండ, హుస్సేన్‌నగర్, మైలారం, రామడుగు, న్యావనంది, తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బాపూజీ వచనాలయ పరిరక్షణకు మరో ఉద్యమం : పరిరక్షణ కమిటీ నేతలు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాపూజీ వచనాలయ పాలకవర్గ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలను తలపించాయని ఎన్నికల్లో అనేక అక్రమాలు జరిగాయని బాపూజీ వచనాలయ పరిరక్షణ కమిటీ నేతలు కోనేరు సాయికుమార్, రమేష్‌బాబు, ఓమయ్య, తదితరులు ఆరోపించారు. ఆదివారం నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో బాపూజీ వచనాలయ పరిరక్షణ సమితి కన్వీనర్ కోనేరు సాయికుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ కార్యదర్శి రమేష్‌బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఓమయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు శివ, తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు అందుబాటులో జిల్లా కేంద్రంలో నడిబొడ్డులో ఉన్న బాపూజీ వచనాలయాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. బాపూజీ వచనాలయంలో అక్రమాలకు పాల్పడుతున్న వారికి వ్యతిరేకంగా పోరాటంలో ప్రతీఒక్కరు కలిసి రావాలని పిలుపునిచ్చారు. నగరం నడిబొడ్డులో విలువైన స్థలంలో ఉన్న బాపూజీ వచనాలయ ఆస్తులను కాజేసేందుకు కొంత మంది కుట్ర పన్నుతున్నారని, దాన్ని పరిరక్షణకు ప్రతీఒక్కరు మరో ఉద్యమంలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పౌరహక్కుల సంఘం నాయకులు ఆల్గోట్ రవీందర్, పీడీఎస్‌యూ కార్యదర్శి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రమాదం'

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విధానాల వల్ల రాజ్యాంగ మౌలిక సూత్రాలకే పెనుప్రమాదం అని మార్క్సిస్టు అంబేద్కరిస్టు సైద్ధాంతిక విశ్లేషకులు, రచయిత సాదు మల్యాద్రి ఆందోళన వ్యక్తం చేశారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బహుజన కమ్యూనిస్టు) బీఎల్‌పీ తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలు ఆదివారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో రెండవ రోజు ప్రతినిధుల మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరై ఆయన మాట్లాడుతూ దేశంలో కులవివక్ష నేటికీ ఎదురవుతూనే ఉందన్నారు. బహుజన శ్రామిక ప్రజలు గౌతమబుద్ధుడు, జ్యోతిభాపూలే, సావిత్రిపూలే, సాహూ మహరాజ్, పెరియాల్ వంటి మహానుభావుల ఆలోచన విధానాలతో ఉద్యమించడం ద్వారానే బీజేపీ మతోన్మాద రాజకీయాలను ఓడించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెకంట్, కార్యదర్శి సిద్ధి రాములు, ఉపాధ్యక్షురాలు సబ్బని లత, నాయకులు బ్రాహ్మణపల్లి జగదీశ్, మనిమూద్, నాగారపు ఎల్లయ్య, అజయ్, జిజాబాయ్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.250	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.255	రూ. 280

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78700	రూ.72600	రూ.950

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.00, 2.05, 6.10, 10.15)
స్క్రీన్-2 : ఫియర్ (11.15)
: మిస్ యూ (2.20)
: పుష్ప-2 (5.10, 9.15)
స్క్రీన్-3 : ప్రణయ గోదావరి (11.10)
: పుష్ప-2 (2.20, 6.25, 10.30)
స్క్రీన్-4 : పుష్ప-2 (10.00)
: పని (2.05)
: మిస్ యూ (5.10, 10.35)
: ఫియర్ (8.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : పుష్ప-2 (1.30, 7.00)
స్క్రీన్-2 : పుష్ప-2 (11.00, 4.30, 10.00)
స్క్రీన్-3 : మిస్ యూ (10.40, 1.20, 7.50, 10.30)



దేవి : పని (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : పుష్ప-2 (హిందీ) (10.00, 2.00, 6.00, 10.00)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్ : మిస్ యూ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్